

మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్ లాల్ ప్రసాద్

# అసెంబ్లీ పోలింగ్‌కు సిబ్బంది రెడీ

- ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు తరలిన సిబ్బంది
- నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో అందరిలో ఉత్కంఠ..
- పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు
- పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను సందర్శించిన కలెక్టర్, రామగుండం సీపీ



డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది



పోలింగ్ సామగ్రి తరలిస్తున్న సిబ్బంది

మంథని, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం పోలింగ్ జరగనుంది. మంథని నియోజకవర్గంలోని 10 మండలాల్లో ఉన్న 288 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్‌కు మంథని ఆర్వో హనుమానాయక్ ఆధ్వర్యంలో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం రామగిర మండలం సెంటనరీకాలనీలోని మంథని జేఎన్టీయూహెచ్ కళాశాల నుంచి తమకు కేటాయించిన వాహనాల్లో పోలింగ్ అధికారులు, సిబ్బంది సామగ్రితో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తరలి వెళ్లారు. మావోయిస్టులు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన నేపథ్యంలో నక్సల్స్ ప్రాబల్య ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా జరిగే విషయంపై మారుమూల గ్రామీణ ప్రజల్లో, పోలింగ్ నిర్వాహణ అధికారులు, పోలీస్ యంత్రాంగంలో సర్వత్ర ఉత్కంఠ నెలకొంది.

**పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్**

రామగిరి మండలం సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూహెచ్ కళాశాల ఆవరణలో ఉన్న పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్, అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్, సీఎన్ శ్రీధర, జిల్లా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్‌లు గురువారం పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడి పంపిణీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం మంథని అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

**భద్రత చర్యలను పరిశీలించిన రామగుండం సీపీ..**

మంథని జేఎన్‌టీయూహెచ్ కళాశాలలోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీ పరిశీలించారు. నియోజ కవర్గంలో పోలింగ్ నిర్వహణతో పాటు ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, కలెక్షన్ పాయింట్‌గా ఏర్పాటు చేసిన జెఎన్‌టీయూహెచ్‌లో పోలీస్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు ఆమె పలు అంశాలపై సూచనలు, సలహాలు అందజేశారు.

**పోలింగ్ కోసం కట్టుదిట్టమైన చర్యలు..**

పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెబ్ కాస్టింగ్ సిస్టంను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. పలు కేంద్రాల్లో వీడియో చిత్రీకరణ కోసం ఏర్పాటు చేయడంతో పాటు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఎన్నికల విధుల నిర్వాహణ కోసం ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్‌లు, వీడియో సర్వేలైన్ టీంలు, ఎంసీసీ టీంలు, అసిస్టెంట్ ఎక్స్‌పండేచర్ అబ్జర్వర్, కంట్రోల్‌రూం, సివిజిల్, సెక్టార్, రూట్ ఆఫీసర్స్‌గా మొత్తం 138 టీముల్లో 299 మంది అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా 288 మంది పోలింగ్ అధికారులుగా, 288 మంది ఏపీవోలుగా, 576 మంది వోపీవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. 288 పోలింగ్ కేంద్రాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 59 ఎల్‌డబ్ల్యూఈ పోలింగ్ కేంద్రాలుగా ఉన్నాయి. 173 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 4 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ అవుట్ సైడ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 37 సెక్టార్లను 47 రూట్లుగా విభజించి ఏర్పాటు చేశారు. 80 మంది ఉద్యోగులను ఎన్నికల విధులుగా రిజర్వు చేసి ఉంచారు.

**సాయంత్రం 4గంటల వరకే పోలింగ్..**

మావోయిస్టుల ప్రాబల్యాన్ని దృష్టిలో పెట్టుకొని మంథని నియోజవర్గంలోనే పోలింగ్ నిర్వహణ సమయాన్ని ఒక గంటను కుదించి సాయంత్రం 4గంటల వరకే పోలింగ్ ముగించడానికి చర్యలు తీసుకున్నారు. మంథని నుంచి పోలింగ్ సిబ్బంది, సామగ్రితో బయలుదేరిన వాహనాలు సురక్షితంగా రాత్రి వరకు తమ కేటాయించిన స్థానాలకు చేరుకున్నాయి. గురువారం ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

**ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వీరే..**

బీఆర్ఎస్ నుంచి పుట్ట మధూకర్, కాంగ్రెస్ నుంచి శ్రీధర్‌బాబు, బీజేపీ నుంచి చంద్రుపట్ల సునీల్‌కుమార్, బీఎస్పీ నుంచి చల్లా నారాయణ, ధర్మసమాజ్ అభ్యర్థి చిట్యాల శ్రీనివాస్, ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అభ్యర్థి ఆజిత కుమార్‌సాగి, ఆలియన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫ్మా పార్టీ అభ్యర్థిగా ఆర్ల నాగరాజు, ఆబాద్ పార్టీ అభ్యర్థిగా కొండ మహేందర్, ప్రజారాజ్య సమితి అభ్యర్థిగా దుర్గం నాగేశ్వర్‌రావు, తెలంగాణ లేబర్ పార్టీ అభ్యర్థిగా ఇరుగురాళ్ల సంతోష్, భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నూనె సంజీవ్, స్వతంత్ర అభ్యర్థులుగా ఆరికిల్ల రామకృష్ణ, పోతుల అన్వేష్, చల్లా లక్ష్మణ్, నూనె రాజేశం, పోతుల రాజేశ కన్నా, గట్టు కృష్ణరావు, మాడెం వెంకటేశ్, గోరిగె కిరణ్‌మార్, రానవేన లక్ష్మణ్, బుట్టి దామోదర్ బరిలో ఉన్నారు.

**2,36,442 ఓటర్లు.. 288 పోలింగ్ కేంద్రాలు..**

మంథని నియోజకవర్గంలోని 10 మండలాల్లో 2023 లో నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు.. మొత్తం ఓటర్లు: 2,36,442 ఉండగా వారిలో పురుషులు: 1,16,707, స్త్రీలు: 1,19,716. ఇతరులు: 19 ఉన్నారు. సామాజిక వర్గాల వారిగా ఓసీలు: 18,597, బీసీలు 1,36,274, ఎస్సీలు: 59,485, ఎస్టీలు: 12,878, మైనార్టీలు: 9,208 ఉండగా వీరు తమ ఓటు హక్కును వినియోగించుకోవటాని 288 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

## ఆఫీసుల చుట్టూ తిరిగే బాధ తప్పింది



మంథని : ధరణి అచ్చినప్పటి నుంచి ఆఫీసుల చుట్టూ తిరిగే బాధ తప్పింది. గతంలో నాలాంటి రైతులు వేరే రైతుకు భూమి అమ్మినప్పుడు, కొన్నప్పుడు వీఆర్వోలు, గిర్దావర్ల చుట్టూ తిరిగి తిరిగి ఇబ్బందులు పడ్డం. ఈ కాగితం లేదు, ఆ కాగితం లేదు అని పట్టా చేయడానికి సతాయించేటోళ్లు. అన్ని కష్టాలు అనుభవించి పట్టా చేసుకున్నా రికార్డుల్లో ఏదో ఒక్క తప్పు ఉండేది, దాన్ని సరిచేసుకోవడానికి ఆఫీసుల చుట్టూ మళ్లీ తిరిగి తిరిగి ఇబ్బందులు పడ్డం. రైతుల భూ రికార్డుల సమస్యలను గుర్తించిన సీఎం కేసీఆర్ సార్ ధరణిని తీసుకువచ్చిండ్లు. ఈ ధరణి అచ్చినప్పటి నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయినయ్. ఏ రైతుకు సంబంధించిన భూమిని ఆ రైతుకు పక్కాగా నమోదు చేసిండ్లు. ఏమైనా ఇబ్బందులున్నా రోజుల తరబడి చూడకుండా మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని వాళ్లు ఇచ్చిన టైంకు పోతే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టా చేసి ఇస్తున్నరు.

**-గూడ మల్లన్న, రైతు, మంథని.**

## రైతులను వీధి పాలు చేస్తారా..?



మంథని రూరల్: ధరణితో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. ఆన్‌లైన్‌లో భూముల వివరాలు చూసుకుంటున్నాం. ఇంత మంచిగ పని చేసుకుంటున్న ధరణిని ఎత్తివేసి రైతులను వీధి పాలు చేస్తారా? కాంగ్రెస్ పార్టీ రైతులను ముప్పు తిప్పలు పెట్టింది. అలాంటి తిప్పలు రైతులకు ఉండవద్దని రైతు బాంధవుడు కేసీఆర్ ధరణిని తీసుకువచ్చాడు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు యజమానికాలం, అనుభవదారుడి కాలం వంటివి ఉండేవి. కానీ భూమి ఉన్నోళ్లకే ధరణిలో పేరు వచ్చి ఊళ్లల్లో గొడవలు తగ్గినయ్. భూమి యజమాని లేదా కౌలు రైతుకు మాత్రమే కాంగ్రెస్ పార్టీ రైతు బంధు ఇస్తానంటే యజమాని, కౌలు రైతుల మధ్య లొల్లిలు షురూ అవుతాయి.

**- శనిగలం లచ్చన్న, రైతు, వెంకటాపూర్,**




బందోబస్తులో పోలీస్ అధికారులు



డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌లో అదనపు కలెక్టర్



సామగ్రి తరలిస్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది